


# కరపత్రం

SINCE 2014

బుధవారం డిసెంబర్ 31 2025 సంపుటి : 2 సంచిక : 86 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4



## కుటుంబ సమేతంగా తిరుమలకు రేవంత్ రెడ్డి

♦ శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ సిఎం

**తిరుమల,డిసెంబరు 30**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలను సందర్శించారు. మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీవారిని రేవంత్ రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు.

2లో..

## సంక్రాంతికి మరో 11 ప్రత్యేక రైళ్లు దక్షిణ మధ్య రైల్వే



హైదరాబాద్:
ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సంక్రాంతి పండగకు దక్షిణ మధ్య రైల్వే మరికొన్ని ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. ఇప్పటికే ప్రకటించిన రైళ్లకు అదనంగా మరో 11 ట్రైన్లను నడపనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. జనవరి 7 నుంచి 12వ తేదీ మధ్య కాకినాడ-వికారాబాద్, వికారాబాద్-పార్వతీపురం, పార్వతీపురం-వికారాబాద్, పార్వతీపురం-కాకినాడ టౌన్, సికింద్రాబాద్-పార్వతీపురం, కాకినాడ టౌన్-వికారాబాద్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. ఆయా రైళ్లలో 1ఏసీ, 2 ఏసీ, 3 ఏసీ, స్లీపర్ కోచ్‌లతో పాటు సెకండ్ క్లాస్ కోచ్‌లు కూడా అందుబాటులో ఉంటాయయని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఆయా రైళ్లకు బుకింగ్స్ ప్రారంభమయ్యాయని పేర్కొంది.

2లో..

## బంగ్లా చొరబాట్లను ప్రోత్సహిస్తున్న మమత



» కంచె వేయకుండా మోకాలడ్డిన బెంగాల్ సిఎం
» ఘాటు విమర్శలు చేసిన కేంద్రహోంమంత్రి అమిత్ షా

**కోల్‌కతా,డిసెంబర్30 :**
భారత్ బంగ్లా సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి మమతా సర్కార్ అడ్డం పడుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు.

# ప్రణాళికాబద్ధంగా నగరాభివృద్ధి

## చెత్త, కాలుష్య నివారణ అతిపెద్ద టాస్క్

- చెత్త ఏరివేతకు వారినికి మూడ్రోజులు స్పెషల్ డ్రైవ్
- ప్లాస్టిక రహిత నగరంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు
- నాలాలు, చెరువుల ఆక్రమణలు కాకుండా చూడాలి
- జనవరి నుంచి నాలాల పూడికతీత పనులు
- గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్‌కు మారాలి
- జోనల్ కమిషనర్లకు సిఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం




2లో

**హైదరాబాద్, డిసెంబరు 30 :**
ఓఆర్ఆర్ లోపల ప్రాంతాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని జీహెచ్ఎంసీ కొత్త జోనల్ కమిషనర్లకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. కొత్త జోనల్ కమిషనర్లతో సమావేశమైన సీఎం.. వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.
మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలమెంట్ విభాగం అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్షలో కొత్త జోనల్ కమిషనర్లకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశర చేశారు. క్యూర్ పరిధిలో సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా చేశాం. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని నిర్ణయించాం. జోనల్ కమిషనర్లు ప్రతిరోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందే. జోన్ల వారీగా సమస్యలు పరిష్కరించే బాధ్యత కమిషనర్లదే అని స్పష్టం చేశారు. నగరంలో అత్యంత సంక్లిష్టమైన సమస్య చెత్త నిర్వహణ. నెలకు 3 రోజులు పారిశుద్ధ్య పనుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. నగరగంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించేలా చర్యలు చేపట్టాలి. క్యూర్ పరిధిలో డీజీల్ బస్సులు, ఆటోల స్థానంలో విద్యుత్ వాహనాలు తీసుకురావాలి. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలి. గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నరెన్స్‌కు మారాలి. జనవరి నుంచి నాలాల పూడికతీత పనులు చేపట్టాలి. హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలు బాధ్యత తీసుకోవాలని సిఎం రేవంత్ ఆదేశించారు. మంచి ఫలితాలు రాబట్టాలంటే ..జోనల్ కమిషనర్లు ప్రతీ రోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందేనని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ఏరియాను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలనే తెలంగాణ రైజింగ్ - 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసుకున్నామని వ్యాఖ్యానించారు. క్యూర్ పరిధిలోని సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించామని చెప్పుకొచ్చారు.

# విజయవాడ రహదారిపై కన్నేయండి

» సంక్రాంతి రద్దీ లేకుండా ప్లాన్ చేయండి
» అధికారులకు మంత్రి కోమటిరెడ్డి సూచన



**హైదరాబాద్,డిసెంబర్30 :**
సంక్రాంతి నేపథ్యంలో జాతీయ రహదారులపై ట్రాఫిక్ రద్దీ నివారణకు చర్యలు తీసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఏటా సంక్రాంతి ముందు ఈ రహదారిపై వాహనాల రద్దీ వల్ల ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు
చేపట్టాల్సిన చర్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. గతంలో ఎదురైన అనుభవాల దృష్ట్యా వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఈ అంశంపై దృష్టి పెట్టారని చెప్పారు. హైదరాబాద్-విజయవాడ హైవేపై జనవరి 8 నుంచి వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రోజుకు సుమారు లక్ష వాహనాలు ఆ మార్గంలో వెళ్తాయి. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలి. బుధవారం తూప్రాన్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తా. ప్రధానంగా ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో వేలాది వాహనాల రద్దీ ఏర్పడుతుంది. ఈ ప్రాంతాల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ ట్రాఫిక్‌జామ్ కావడానికి వీల్లేదు. పండగ రద్దీ ఉన్నన్ని రోజులూ రోడ్లు మూసేయొద్దు. భారీ యంత్రాలతో పనులు చేపట్టవద్దు.

2లో..

## కోనసీమ అభివృద్ధిపై పవన్ కళ్యాణ్ దృష్టి

» శంకర్ గుప్తం మురుగుకాల్వ పూడికతీతకు శంకుస్థాపన
» రూ.20.77 కోట్ల అంచనా వ్యయంతో పనులకు పవన్ కళ్యాణ్ శ్రీకారం



**అంబేద్కర్ కోనసీమ,డిసెంబరు 30:**
కోనసీమ అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా కేసనపల్లి తుఫాన్ సెంటర్‌లో శంకర్ గుప్తం ప్రధాన మురుగు కాలువకు సంబంధించిన ఎనిమిది కిలోమీటర్లు పొడవునా పూడికతీత పనులు,14.5 కిలోమీటర్ల పొడవునా గట్ల పటిష్టత పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

2లో..



## తెలంగాణ అసెంబ్లీ బిఆర్ఎస్ లీడర్ల నియామకం

» డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్‌గా హరీశ్‌రావు, సబితా, తలసాని
» బీఆర్ఎస్ ఉప నేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి
» ప్రకటన విడుదల చేసిన అగ్రనేత కెసిఆర్

2లో..

**హైదరాబాద్,డిసెంబరు 30 :**
తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ అధికార నాయకత్వంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి.



2 లో

## తెలంగాణలో అదుపులో శాంతిభద్రతలు

» పంచాయితీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాం
» ఫ్యూచర్ సిటీలో సమర్థంగా గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ
» మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా సజావుగా నిర్వహించగలిగాం
» మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం
» 2025 వార్షిక నివేదిక విడుదల చేసిన డిజిపి శివధర్ రెడ్డి

**క్రైమ్ రేటును బాగా తగ్గించ గలిగాం**

**హైదరాబాద్,డిసెంబర్ 30 :**
తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఇటీవలి మూడు విడతల్లో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో కూడా శాంతి భద్రతలు కాపాడి నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూశామని డీజీపీ అన్నారు. మంగళవారం నాడు 2025 వార్షిక నివేదికను డీజీపీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది పండుగల బందోబస్తు పటిష్టంగా చేశామన్నారు. ఫ్యూచర్ సిటీలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతంగా భద్రతాపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు.

## కెసిఆర్ అసెంబ్లీ చర్చకు వస్తారా?

♦ పాలమూరు-రంగారెడ్డిపై మాట్లాడుతారా
♦ రాజకీయ వర్గాల్లో సర్వత్రా ఇదే చర్చ
♦ 2న తిరిగి ప్రారంభం కానున్న అసెంబ్లీ



2లో..

**హైదరాబాద్,డిసెంబరు 30 :**
కెసిఆర్ తొలిరోజు అసెంబ్లీకి వచ్చారు. మళ్లీ వస్తారా అని అందరి అభిప్రాయంగా ఉంది. అసెంబ్లీలో ఆయన మాట్లాడితే చూడాలని కూడా చాలాంది అభిప్రాయంగా ఉంది. కెసిఆర్ మీడియా ముందుకన్నా, అసెంబ్లీలో తన వాణి వినిపించి ఆరోపణలకు సమాధానం చెప్పాలని కోరుకుంటున్నారు. 2న తిరిగి అసెంబ్లీ సమావేశం కానుంది. అయితే కెసిఆర్ అసెంబ్లీ సమావేశాలకు హజరవుతారా లేదా అంటూ గత కొన్నాళ్లుగా రాజకీయ వర్గాల్లో జరుగుతున్న వేళ, సోమవారం మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి వచ్చారు.




## సింగరేణి బకాయిలపై శ్వేతపత్రం విడుదల

టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్

**గోదావరిఖని,డిసెంబర్30 :**
సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిలపై ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో

2లో..



## జివో 252తో జర్నలిస్టులకు అన్యాయం

» మంత్రి పొంగులేటిని కలిసిన యూనియన్ నేతలు
» అక్రిడిటేషన్ల గడువు మరో 2నెలలు పొడిగింపు

**హైదరాబాద్,డిసెంబర్30 :**
అక్రిడిటేషన్‌ల విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో 252తో తమకు అన్యాయం జరుగుతుందని డెస్క్ జర్నలిస్టులు గడిచిన వారం రోజులుగా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

2లో..

# కెసిఆర్ అసెంబ్లీ చర్చకు వస్తారా?

మొదటిపేజీ తరువాయి

కేవలం కొద్దిసేపు మాత్రమే ఉండి వెళ్లిపోయారు. ఆయనకు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. సోమవారం ఎట్టకేలకు శాసనసభలో వచ్చి కూర్చున్నారు. సభలోకి వచ్చిన కొద్ది నిమిషాలకే బయటకు వెళ్లిపోయారు. అయితే, ఆయన చర్య గులాబీ శ్రేణుల్లో ఎక్కడలేని ఉత్సాహాన్ని నింపింది. వెంటనే ఇలా వచ్చి అలా వెళ్లిపోయిన కేసీఆర్ తిరిగి కొత్త సంవత్సరం రెండో రోజు నుంచి జరిగే సమావేశాలకు వస్తారా? లేదా? అనే కొత్త చర్చ రాజకీయ వర్గాల్లో, సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. కేసీఆర్ తప్పకుండా సభకు వస్తారని, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణా జలాల అంశంపై మాట్లాడతారని బీఆర్ఎస్ శ్రేణులు గట్టిగా నమ్ముతున్నాయి. ఎందుకంటే కెసిఆర్ వస్తారని, మాట్లాడుతారని గతకొంత కాలంగా హరీష్ రావు, కెటిఆర్ఉ చెబుతూ వచ్చారు. సోమవారం కేసీఆర్ శాసనసభకు రావడం ఖరారు కావడంతో అసెంబ్లీ ప్రాంగణంలో ఉదయమే పార్టీ ఎమ్మెల్యేలు ఆయనకు స్వాగతం పలికేందుకు వేచి ఉన్నారు. దాంతో అక్కడంతా హడావుడి కనిపించింది. బీఆర్ఎస్ ముఖ్య నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, తదితరులు కేసీఆర్‌కు స్వాగతం పలికారు. ఆయన మొదట అసెంబ్లీ లాబీలో తనకు కేటాయించిన ప్రతిపక్ష నేత ఛాంబర్‌లోకి వెళ్లారు. అక్కడే సభకు సంబంధించిన హాజరు నమోదు పత్రంలో సంతకం చేశారు. తర్వాత అసెంబ్లీ హాల్లోకి వెళ్లి కూర్చున్నారు. కొద్ది నిమిషాల్లోనే తన నివాసానికి బయలుదేరి వెళ్లారు.ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణా జలాల అంశంపై చర్చ జరుపుదామని, కేసీఆర్ సభకు రావాలంటూ ఈ మధ్యకాలంలో అధికార పార్టీ నేతలు సవాల్ విసురుతున్నారు. ఈ నేపథ్యంలోనే జనవరి రెండు లేదా మూడో తేదీన కేసీఆర్ శాసనసభకు వస్తారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీలో చర్చించే అంశాలపై స్పష్టత వచ్చాక, చర్చించే అంశాలను బట్టి కేసీఆర్ పాల్గొనే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా, గత ప్రభుత్వాల ప్రతిపాదనలు, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తీసుకున్న నిర్ణయాలపై కేసీఆర్ మాట్లాడతారని సమాచారం. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ సర్కార్ అనుసరిస్తున్న వైఖరి వల్ల రెండు జిల్లాల రైతులకు ఎలాంటి నష్టం జరగనుందో కేసీఆర్ ప్రస్తావిస్తారని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. అసెంబ్లీ సమావేశాల తర్వాత ఇదే అంశంపై క్షేత్రస్థాయి కార్యాచరణ సిద్ధం చేసి, ప్రజల్లోకి వెళ్తారని అంటున్నారు. రెండు అంశాలపై అసెంబ్లీ వేదికగా ఏం చెప్పాలి? ఇప్పటివరకు ఎదురైన ఇబ్బందులు, భవిష్యత్‌లో ఏర్పడే ప్రమాదాలు వంటి వాటిపై కేసీఆర్ సంబంధిత నిపుణులతో చర్చలు జరుపుతూ సన్నద్ధం అవుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత ఒకరు తెలిపారు. అయితే విపక్షనేతగా ఈ రెండేళ్ల కాలంలో అసెంబ్లీలో కెసిఆర్ ఎక్కడా కనిపించలేదు. కేవలం సంతకం పెట్టి వెళ్లిపోయారు. కనీసం ఇప్పుడైనా రాకుటే ఇక బిఆర్ఎస్‌పై ప్రజల్లో నమ్మకం కూడా కానరాదు.

# తెలంగాణలో అదుపులో శాంతిభద్రతలు

మొదటిపేజీ తరువాయి

మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా దిగ్విజయంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుపుకున్నామని చెప్పారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించడం లో పోలీసులు సమర్థంగా పనిచేశారని అన్నారు. తెలంగాణలో మహిళా పోలీసుల అధికారులు బాగా పనిచేస్తున్నారని కొనియాడారు. సీఐడీ చీఫ్, ఏసీబీ డీజీ చారు సిన్హా , తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్గా శిఖా గోయల్, ఎస్ఐబీ ఐజీ సుమతి ఉన్నారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్లో క్యూఆర్ కోడ్ పెట్టడం జరిగిందని, ఫీడ్ బ్యాక్ కోసం ఈ ఏడాది ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలో 41 శాతం సైబర్ నేరాలు పెరిగితే.. తెలంగాణలో 3 శాతం సైబర్ నేరాలు తగ్గాయన్నారు. తెలంగాణలో గత ఏడాదితో పోలిస్తే 2.33శాతం క్రైమ్ రేట్ తగ్గిందని వివరించారు. ఈ ఏడాది 2.28 లక్షలు కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో 4 కేసులో మరణ శిక్షలు ఖరారు అయ్యాయని.. 216 కేసుల్లో 320 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పండిందని తెలిపారు. ఫోక్సో కేసుల్లో 144 కేసుల్లో 154 మందికి శిక్షలు ఖరారు అయ్యాయని.. అందులో ముగ్గురికి మరణ శిక్ష, 48 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పడ్డాయని డీజీపీ పేర్కొన్నారు. డ్రగ్స్ కట్టడి కోసం ఈ ఏడాది ఈగల్ టీమ్‌ను సీఎం రేవంత్ రెడ్డి లాంచ్ చేశారన్నారు. ఈ ఏడాది 1.20 లక్షల సెల్ ఫోన్లు ట్రేస్ చేయడంలో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో దేశంలో తెలంగాణ రెండో స్థానంలో ఉందని వెల్లడించారు. తెలంగాణలో 509 మంది నక్సల్స్ లొంగిపోయారని.. వారిలో 481 మంది ఛత్తీస్‌గఢ్, 21 మంది తెలంగాణ, ఒకరు మహారాష్ట్ర, ఒకరు ఏపీ నక్సల్స్ ఉన్నారన్నారు. నాలుగు నేషనల్ లోక్ అదాలత్, 1 స్పెషల్ అదాలత్ నిర్వహించమన్నారు. 7 లక్షల కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించామని చెప్పారు. పోలీస్ శాఖను హైకోర్టు అభినందించిందని వెల్లడించారు. మూడు అంతర్జాతీయ ఈవెంట్స్ సక్సస్ ఫుల్‌గా నిర్వహించుకున్నామని తెలిపారు. ట్రావెల్ సేఫ్ పేరుతో సీఐడీ నూతన యాప్ తీసుకొచ్చిందని.. మహిళలు, జర్నీ చేసే వారికి ఈ యాప్ చాలా ఉపయోగపడుతుందని సూచించారు. టూరిస్ట్ పోలీసులను ఈ ఏడాది లాంచ్ చేశామన్నారు. 80 మంది నియమించి.. టూరిస్ట్ ప్లేస్‌లో పోలీసులు ఎలా పని చేయాలనే దానిపై ట్రైనింగ్ ఇచ్చామని తెలిపారు. ప్రైవేటు సంస్థల్లో మహిళల కోసం కమిటీలు ఏర్పాటు చేశామని.. పోష్ యాక్ట్‌ను తీసుకొచ్చామన్నారు. తెలంగాణలో ఈ ఏడాది ఫిల్మ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయబోతున్నామని.. ఇందులో 18 నుంచి 35 ఏళ్ళు లోపు ఉన్న వారు హాజరువుతారని తెలిపారు. టీజీ ఆర్టీసీ డ్రైవర్లను ఈ ఏడాది పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ద్వారా పరీక్ష నిర్వహించామన్నారు. నయీమ్ కేసు సీఐడీ విచారణలో ఉందన్నారు. నయీమ్ కేసులో సీజ్ అయిన ల్యాండ్స్, చాలా మంది అమ్మాలని ప్రయత్నం చేశారని తెలిపారు. నయీమ్ లాండ్స్‌పై హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. ఆ ల్యాండ్ ఎవరూ కొనవద్దని, అమ్మవద్దని ఆదేశాలు ఉన్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో డ్రగ్స్ కేసులు భారీగా పెరిగాయని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే 30 శాతం డ్రగ్స్ కేసులు పెరిగినట్లు చెప్పారు. వేరే రాష్టాల్లో ఉన్న నిందితులను ఈగల్ టీమ్ పట్టుకొస్తోందన్నారు. ఈగల్ టీమ్ ఈ ఏడాది రూ.173 కోట్ల డ్రగ్స్ సీజ్ చేసిందని అన్నారు. నమ్మక ద్రోహం కేసులు తెలంగాణలో 23 శాతం పెరిగాయన్నారు. ఐపీసీ సెక్షన్ కింద కేసులు 7.83 ? పెరిగాయని.. అలాగే మహిళలపై దాడులు కేసులు 2.90 ? పెరిగాయని అన్నారు. 248 మంది మహిళల హత్యలకు గురయ్యారని తెలిపారు. రేప్ కేసులు 13? తగ్గిందని, కిడ్నాప్‌లు 10? , వేధింపులు కేసులు 9? తగ్గాయని అన్నారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఈ ఏడాది 23? రికవరీ చేసిందని... రూ. 246 కోట్లు రికవరీ అయినట్లు తెలిపారు. 25,500 మంది బాధితులకు రూ.159 కోట్లు రీ ఫండ్ చేసినట్లు డిజిపి తెలిపారు.

# ప్రణాళికాబద్ధంగా నగరాభివృద్ధి

మొదటిపేజీ తరువాయి

పరిపాలనను పట్టాలెక్కించాలనేదే తమ ఆలోచన అని తెలిపారు. హైదరాబాద్ నగరంలో అత్యంత సంక్లిష్టమైన సమస్య చెత్త నిర్వహణ అని వివరించారు. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. జోన్‌ల వారీగా సంబంధిత సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్‌లదేనని స్పష్టం చేశారు. సిటీలో కాలుష్య నియంత్రణకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్షాళన తీసుకుంటున్నామని వెల్లడించారు సీఎం రేవంత్‌రెడ్డి. చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నెలకు మూడు రోజులు శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని దిశానిర్దేశంచేశారు.

రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడానికి వీల్లేదని ఆదేశాలు జారీ చేశారు. అలాగే, రోడ్లపై గుంతలు కనిపించొద్దని సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువపత్రాల జారీకి టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని మార్గనిర్దేశం చేశారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ లతో కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోవాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. హైడ్రా, జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి ప్రారంభించాలని నిర్దేశించారు. నగరంలో వీధి దీపాలు సరిపడా ఉండేలా చూసుకోవాలని సూచించారు. క్యూర్ ఏరియాలో ఆయా విభాగాల అధికారులను సమన్వయం చేసే బాధ్యత స్పెషల్ సీఎస్ చూసుకుంటారని పేర్కొన్నారు. దోమల నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా జోనల్ కమిషనర్ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతీ పది రోజులకోసారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఎక్కడ సమస్య తలెత్తినా పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబర్‌కు వీలైనంత స్పీడ్‌గా రెస్పాన్స్ అవ్వాలని మార్గనిర్దేశర చేశారు. ఈ నేపథ్యంలో వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ఎ÷-లాన్ రూపొందించుకోవాలని సూచించారు. అధికారులు అందరూ కలిసి పనిచేస్తేనే నగరం భవిష్యత్ బాగుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# యూరియా సరఫరా కొనసాగుతోంది

జిల్లా కలెక్టర్లతో జరిగిన వీడియోకాన్ఫరెన్స్ లో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఇచ్చిన ఆదేశాలనుసారం అన్ని జిల్లాలలో ఆయా కలెక్టర్ల పర్యవేక్షణలో యూరియా సరఫరా చేపట్టారు. అదేవిధంగా మంత్రి సూచన మేరకు జెడి,ఎడిఎలను జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించిన వ్యవసాయశాఖ డైరెక్టర్, వారు వారికి కేటాయించిన జిల్లాలలో పర్యటించి ప్రత్యక్షంగా యూరియా సరఫరాలను పర్యవేక్షించనున్నారు. రబీ సీజన్‌కు గాను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి వివిధ రకాల ఎరువులుగా మొత్తం 20.10 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, అందులో 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తెలిపారు.కేంద్ర ప్రభుత్వం నుండి అక్టోబర్ నెల నుండి ఇప్పటివరకు రాష్ట్రానికి 5.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా, ఇప్పటికే 5.84 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు పేర్కొన్నారు. కేటాయించిన పరిమాణం కంటే 24 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అధికంగా జరిగిందని తెలిపారు. రబీ సీజన్‌లో ఇప్పటివరకు రైతులు 3.71 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కొనుగోలు చేశారని, ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలిపి 2.15 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు, అంటే 47.68 లక్షల సంచులు అందుబాటులో ఉన్నాయని మంత్రి వెల్లడించారు. రబీ సీజన్‌కు అవసరమైనంత యూరియా రాష్ట్రంలో పూర్తిగా అందుబాటులో ఉంది. రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి కేటాయించిన మేరకు యూరియా సమయానుకూలంగా రాష్ట్రానికి చేరుతోందన్నారు. ప్రతిపక్ష నాయకుల మాటలు విని, భయాందోళనకు గురయి అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, అవసరమైన మేరకే రైతులు వినియోగించుకోవాలి అని మంత్రి కోరారు. యూరియా అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరాపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని పేర్కొన్నారు.

# విజయవాడ రహదారిపై కన్నేయండి

మొదటిపేజీ తరువాయి

అత్యవసరమైనవి అయితే ట్రాఫిక్ తక్కువగా ఉండే రాత్రి వేళల్లో మాత్రమే చేయాలి. రోడ్లపై మట్టి, నిర్మాణ సామగ్రి, యంత్రాలను పూర్తిగా తొలగించాలి. రోడ్డు పనులు జరుగుతున్న ప్రతి చోటా పగలు, రాత్రి స్పష్టంగా కనిపించేలా ట్రాఫిక్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. హై-విజిబిలిటీ కోన్లు, బారికేడ్లు ఏర్పాటు చేసి పనులు జరిగే ప్రాంతం, ట్రాఫిక్ వెళ్లే దారి స్పష్టంగా చూపాలి. ఎక్కడా ట్రాఫిక్‌కు అయోమయం కలిగించేలా ఏర్పాట్లు ఉండకూడదు. రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లు, టోల్ ప్లాజాలు, కీలక ప్రాంతాల్లో అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలి. ట్రాఫిక్ మళ్లింపులు, నియంత్రణ అంశాల్లో స్థానిక ట్రాఫిక్ పోలీసులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలి. అన్ని సంబంధిత శాఖలు పోలీసుల సూచనలను తప్పనిసరిగా అమలు చేయాలి. అన్ని రహదారి ఘటనలను ప్రత్యేక ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షించాలి. టోల్ ఎ÷-లాజాల వద్ద వాహనాలు ఆగకుండా వెళ్లేలా అదనపు బృందాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

# తెలంగాణ అసెంబ్లీ బిఆర్ఎస్ లీడర్ల నియామకం

మొదటిపేజీ తరువాయి

గులాబీ పార్టీ అధ్యక్షుడు, అసెంబ్లీలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య నాయకులను డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లుగా ప్రకటించారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్‌గా హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను ప్రకటించారు. వీరు అసెంబ్లీలో పార్టీ ప్రతినిధుల సహకారం, సభలో పార్టీ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ మేరకు కేసీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు.అసెంబ్లీలో బీఆర్ఎస్ ఉప నేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించనున్నారు. శాసనమండలిలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేయడం, సభ్యులను సభలో సక్రమంగా వ్యవహరించేలా చూసుకోవడం వీరి బాధ్యతగా నిర్ణయించారు. పార్టీ విప్‌గా దేశపతి శ్రీనివాస్ వ్యవహరిస్తారు. విప్ బాధ్యతలు సభలో సభ్యుల హాజరు, అధికార పార్టీ నేతల ప్రతిస్పందనలను సమీక్షించడం, పార్టీ విధానాలను అమలు చేయడం వంటి కీలక అంశాలను కవర్ చేయనున్నారు. కేసీఆర్ తన అసెంబ్లీ నాయకత్వానికి మద్దతుగా మధుసూదనాచారీని బీఆర్ఎస్ ఎ÷-లోర్ లీడర్‌గా కొనసాగించారు. అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ తొలి ప్రతినిధిగా మధుసూదనాచారీని కొనసాగించడం ద్వారా పార్టీ తీసుకునే ముఖ్యమైన నిర్ణయాల అమల్లో కీలకంగా మారనుంది. కేసీఆర్ ప్రకటన బీఆర్ఎస్‌లో సభ్యుల కృషిని ప్రోత్సహించడమే కాకుండా, అసెంబ్లీలో పార్టీ స్థిరత్వాన్ని సుస్థిరంగా ఉంచడానికి దోహదపడుతుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ మార్పుల ద్వారా సభలో సమన్వయంగా పనిచేయడం, విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి లక్ష్యాలను సాధించగలుగుతారని తెలిపారు. డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లు అందరికీ మార్గదర్శకత్వం అందించడం ద్వారా బీఆర్ఎస్ తెలంగాణ అసెంబ్లీలో మరింత ప్రభావవంతంగా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. కేసీఆర్ ప్రకటించిన కొత్త నాయకత్వ నిర్మాణం బీఆర్ఎస్ శక్తిని మరింత పెంచుతూ, అసెంబ్లీలో పార్టీ స్థానాన్ని బలంగా వినిపించేందుకు దోహదపడనుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. బీఆర్ఎస్‌లో సభ్యుల కోసం సమర్థమైన నేతృత్వం, విధాన అమలు, సభలో సమన్వయం వంటి అంశాలు ఈ మార్పుల ద్వారా మరింత కీలకంగా మారుతాయని గులాబీ పార్టీ నేతలు చెప్పుకొచ్చారు.

# కుటుంబ సమేతంగా తిరుమలకు రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

దేవాలయ అధికారులు రేవంత్ కుటుంబసభ్యులకు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న రేవంత్ కుటుంబం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భార్య, బిడ్డా అల్లుడు, మనవడితో కలసి ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నరు.

అనంతరం వారికి పూజారులు శ్రీనివాసుడి తీర్థప్రసాదాలు అందజేశారు. మరోవైపు సాధారణ భక్తులు తిరుమలకు పోటెత్తారు. ఏకాదశి సందర్భంగా ద్వార దర్శనం కోసం భారీగా తిరుమలకు చేరుకున్నారు. తండోపతండాలుగా వస్తున్న భక్తులతో తిరుమల ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.భక్తుల తాకిడికి తగినట్లుగానే అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. భక్తులను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల సౌకర్యాలూ కల్పించారు. పోలీసులు సైతం పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

# జివో 252తో జర్నలిస్టులకు అన్యాయం

మొదటిపేజీ తరువాయి

ఈ క్రమంలో డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరుతూ.. టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్టీ నేతలు మంగళవారం సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. డెస్క్ జర్నలిస్టులకు గతంలో లాగే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, జీవో 252 ని సవరించాలని మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. స్పోర్ట్స్, కల్చరల్, ఫీచర్ ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని ఫెడరేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు సంఘాల వినతిపై మంత్రి పొంగులేటి కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.రిపోర్టర్లతోపాటు డెస్క్ జర్నలిస్టులకు అన్ని సౌకర్యాలు ఉంటాయని, డెస్క్ జర్నలిస్టులు ఎలాంటి అపోహలు పడొద్దని ఆయన చెప్పినట్లు తెలిసింది. త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తానని కూడా చెప్పినట్లు సమాచారం. జర్నలిస్టులకు ఇబ్బంది లేకుండా జీవో 252ను సవరిస్తామని మంత్రి చెప్పనట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే నోటిఫజకేషన్ త్వరాలో వెలువడనున్న తరుణంలో ఆలస్యం కాకుండా ప్రస్తుతం ఉన్న అక్రిడేషన్ల గడవును మరో రెండు నెలలు పెంచారు. ఈ మేరకు సమాచారశాఖ ప్రకటన విడుదల చేసింది. ఫిబ్రవరి 28 వరకు గడువు పొడిగిస్తూ సమాచారశాఖ కమిషనర్ ప్రియాంక ప్రకటన విడుదల చేశారు.

# సింగరేణి బకాయిలపై శ్వేతపత్రం విడుదల

మొదటిపేజీ తరువాయి

ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థకు ఇప్పటివరకు ట్రాన్స్‌కో, జెన్‌కోల నుంచి బొగ్గు అమ్మకాల ద్వారా బకాయిలు రూ. 47 వేల కోట్లకు చేరుకున్నాయని వీటిలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే 24 వేల కోట్ల బకాయిలు పేరుకుపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందని విమర్శించారు.పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోవడంతో సింగరేణి సంస్థ కార్మికులకు జీతాలు చెల్లించడానికి ఓవర్ డ్రాఫ్ట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని దీనికి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. కెసిఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో సింగరేణి సంస్థను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవడంతో పాటు కార్మికుల సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని..ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తీవ్రమైన రాజకీయ జోక్యంతో తమ ఇష్టం వచ్చిన రీతిలో సింగరేణి సొమ్మును వాడుకుంటూ దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోతున్న.. ఆ విషయంలో గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ ప్రాతినిధ్య సంఘమైన ఐఎన్టీయూసీలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. సింగరేణి నిధుల దుర్వినియోగంపై సంస్థకు రావాల్సిన బకాయిలపై సింగరేణి సంస్థ ద్వారా పూర్తి వివరాలతో కూడిన శ్వేత పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు గడిచిన రెండు సంవత్సరాల కాలంలో కార్మికులకు సంబంధించిన ఎలాంటి సమస్యలు పరిష్కారం చేయలేదని సింగరేణి సంస్థ నిర్వీర్యం అవుతున్న పట్టించుకోవడంలేదన్నారు. ఇవి చాలదన్నట్లు టీబీజీకేఎస్ పై నోరు పారేసుకుంటూ విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో టీబీజీకేస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, నాయకులు నూనె కొమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బంగ్లా చొరబాట్లను ప్రోత్సహిస్తున్న మమత

మొదటిపేజీ తరువాయి

పశ్చిమ బెంగాల్‌లో భాజపా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. మమతా బెనర్జీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల ప్రయోజనం కోసం టీఎంసీ పార్టీ బంగ్లాదేశీయుల చొరబాట్లను ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమిని ఇవ్వకపోవడం వల్లే భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కేంద్రం కంచె వేయలేక పోతోందని ఆరోపించారు. సరిహద్దుల్లో చొరబాట్లు కేవలం బెంగాల్‌కు సంబంధించిన సమస్య మాత్రమే కాదని.. మొత్తం దేశానికి సంబంధించిన సమస్యని అన్నారు. వీటివల్ల మన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2026 ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపానే అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే సరిహద్దుల వద్ద చొరబాట్లను ఆపుతామని.. అక్రమ వలసదారులను బెంగాల్ నుంచి తరిమి కొడతామని హామీ ఇచ్చారు. హింసాత్మక రాజకీయాలను సృష్టించడంలో వామపక్షాలను టీఎంసీ అధిగమించిందని అమిత్‌షా న్నారు. మమత పాలనలో రాష్ట్రంలో హింస, అవినీతి రాజ్యమేలాయని..ఆమె అవినీతి వల్లే 15 ఏళ్లుగా బెంగాల్ అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలు కూడా ఇక్కడి ప్రజలకు అందకుండా టీఎంసీ పార్టీ అడ్డుపడుతోందని ఆరోపించారు. ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలంటే భాజపాను గెలిపించాలని ప్రజలను కోరారు. తాము అధికారంలోకి వస్తే బెంగాల్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఉద్యోగాలు కల్పిస్తామని..రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని హామీ ఇచ్చారు.

# కోనసీమ అభివృద్ధిపై పవన్ కళ్యాణ్ దృష్టి

మొదటిపేజీ తరువాయి

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా వర్చువల్‌గా హాజరయ్యారు. కోనసీమ కొబ్బరి రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ రూ.20.77 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులకు పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు. ఇటీవల రాజోలులో తన పర్యటన సందర్భంగా 45 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. 35 రోజుల్లోపే ఈ సమస్యకు సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పరిష్కారం చూపినట్లు జనసేన పార్టీ పేర్కొంది. ఈ క్రమంలో అధికారులకు పవన్ కీలక సూచనలు చేశారు. రాజోలు నియోజకవర్గ రైతులకు ఐదేళ్లుగా దుఃఖ:దాయనిగా మారిన శంకర్ గుప్తం మేజర్ డ్రైనేజ్ సమస్యను సుబ్రహ్మణ్య షష్టి రోజున గుర్తించామని తెలిపారు. కేవలం 34 రోజుల కాలవ్యవధిలో శాశ్వత పరిష్కారం దిశగా ముక్కోటి ఏకాదశిన పనులు ప్రారంభించామని వెల్లడించారు. ఈ పనులకు రూ.20.62 కోట్లు కేటాయించామని అన్నారు. శంకర్ గుప్తం ప్రధాన మురుగు కాల్వతో వరి, కొబ్బరి చెట్లను రైతులు కోల్పోయారని చెప్పుకొచ్చారు పవన్ కల్యాణ్. సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ అధికారులతో సుదీర్ఘ చర్చలు జరిపినట్లు వివరించారు. కేవలం 34 రోజుల్లోనే ఈ పనుల నిర్వాహణకు నిధులు కేటాయించామని చెప్పుకొచ్చారు. కొబ్బరి చెట్లకు నష్టం కలుగకుండా సంరక్షణ చర్యలు చేపడతామని అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.4 వేల కోట్లతో పంట కాలువలు, మురుగు కాలువలు ఆధునీకీకరిస్తామని తెలిపారు. కోనసీమ ప్రాంతనీలో కోకో బోర్డు ఏర్పాటు చేయడానికి కేందప్రభుత్వంతో సంప్రదిస్తామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం డిసెంబర్ 31 2025

# భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు సమన్వయంతో పని చేయాలి

- మహా శివరాత్రి జాతర సమన్వయ సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్, జాతర చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14, 15, 16 తేదీల్లో మహా శివరాత్రి జాతర నిర్వహించనున్న నేపథ్యంలో వేములవాడలోని భీమేశ్వర సదన్ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో జాతర సమన్వయ సమావేశాన్ని మంగళవారం జాతర ఛైర్మన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అద్యక్షతన నిర్వహించగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్, ఎస్పీ మహేష్ బి.గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్, జాతర ఛైర్మన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ భక్తులు భీమేశ్వర ఆలయంలో స్వామి వారి దర్శనాన్ని వేగంగా, సౌకర్యంగా చేసుకునేలా ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని అధికారులను ఆదేశించారు. వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి శ్రీ భీమేశ్వర ఆలయం వరకు వేములవాడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్ల మరమ్మత్తులు, నిర్మాణాలు పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్ లు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. తిప్పాపూర్ ఆర్టీసీ బస్ స్టాండ్ లో తాగు నీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి దానికి ఒక అధికారిని నియమించాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల నిర్వహణ వేములవాడ మున్సిపల్, జిల్లా పంచాయతి అధికారి సంయుక్తంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, ఎక్కడా ఇబ్బంది రాకూడదని స్పష్టం చేశారు. హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని, ప్రతి చోట అన్ని వివరాలతో కూడిన సైన్ బోర్డులు పెట్టించాలని, అందరి ఫోన్ నంబర్ లు ఉండాలని తెలిపారు. ఈ కేంద్రాల్లోని వారికి ఆలయానికి సంబందించిన పూర్తి సమాచారం ఉండాలని ఆదేశించారు. జాతర విధుల్లో పాల్గొనే అన్ని శాఖల అధికారులు వారి సమగ్ర యాక్షన్ ప్లాన్ తో రావాలని తెలిపారు. ఆలయం లోని క్యూల వద్ద, పార్కింగ్ స్థలాల వద్ద తాగు నీటి, మజ్జిగ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. భక్తులకు అల్పాహారం ఉప్మా, పులిహోర, పెరుగు అన్నం, నీటి వసతి చక్కటి వాతావరణంలో కల్పించాలని సూచించారు. ప్రతి జాతర ప్రదేశాల్లో నాణ్యమైన తాగునీటిని అందుబాటులో పెట్టాలని ఆర్ డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులని ఆదేశించారు. మరో సమావేశం నిర్వహిస్తామని, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని ఆదేశించారు. ఆలయ ఆవరణలో 24 గంటలపాటు వైద్య బృందం, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, ఫైర్ సేఫ్టీ అధికారులు ఆలయంలో పరిశీలించి, కావాల్సిన పరికరాలు వివరాలు అందజేయాలని సూచించారు. జాతర ఆవరణలో ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా చూడాలని, సమ్మక్క సారాలమ్మ జాతర నేపథ్యంలో బక్తుల కోసం వైద్య బృందం అందుబాటులో ఉండాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులకు సహాయం కోసం వీల్ చైర్లు వాలంటీరను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి చోట సైన్ బోర్డ్ లు ఉండాలని పేర్కొన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార పదార్థాలను తనిఖీ చేయాలని సూచించారు. ప్రతి శాఖ అధికారి తమ పూర్తి యాక్షన్ ప్లాన్ తో రావాలని తెలిపారు. దర్శనం, వెహికల్ ఇతర పాస్ లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేస్తామని విప్, ఇంచార్జి కలెక్టర్ స్పష్టం చేశారు. మహా శివరాత్రి సందర్భంగా ట్రాఫిక్ కు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతరకు వచ్చే వీఐపీల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని వివరించారు. వేములవాడలో కావాల్సిన సైన్ బోర్డ్, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా వాలంటీర్లను తమకు అప్పగించాలని వివరించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ రుత్విక్ సాయి, ఆర్డీఓ రాధాబాయి, ఆలయ ఈఓ రమాదేవి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, పట్టణ సీఐ వీరప్రసాద్ తదితరులు ఉన్నారు.

# తాత్కాలిక ఆనందం కోసం భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు..

- ఆనందంగా వేడుకలు జరుపుకోండి.. కానీ చట్టానికి లోబడి మాత్రమే
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని డిసెంబర్ 30:**
డిసెంబర్ 31వ తేదీ రాత్రి 10.00 గంటల నుండి రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించబడుతుందని, డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి, బైండ్ఓవర్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ప్రజలు డిసెంబర్ 31 నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇతరుల మనోభావాలు దెబ్బతినకుండా, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాలకు దూరంగా ఉండాలని పలు సూచనలు చేస్తూ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 31 రాత్రి నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్థానిక పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, షీ టీమ్స్, మఫ్టీ టీమ్స్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో కలిసి ప్రమాదాల నివారణ, అక్రమ సిట్టింగులు, బహిరంగంగా మద్యం సేవించడం, గుంపులుగా తిరుగుతూ మహిళలను వేధించడం వంటి సంఘటనలను అరికట్టేందుకు నిరంతర పర్యవేక్షణతో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించబడుతుందన్నారు. ముఖ్యంగా నూతన సంవత్సర వేడుకలను అర్ధరాత్రి 12.30 గంటల లోపు ముగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తు అనుమతులు పొందాలి. కార్యక్రమాల్లో అశ్లీల నృత్యాలకు అనుమతి ఉండదని, అలాగే వేడుకల ప్రాంగణంలో సీసీ కెమెరాల ఏర్పాటు, సెక్యూరిటీ సిబ్బంది నియామకం తప్పనిసరి అని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్కెస్ట్రా, డీజేలు, మైకుల వినియోగం, బాణసంచా పూర్తిగా నిషేధించబడింది. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. మద్యం దుకాణాలు, వైన్ షాపులు, బార్లు, రెస్టారెంట్లు ప్రభుత్వము అనుమతించిన సమయపాలనను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డిసెంబర్ 31 రాత్రి 10.00 గంటల నుండి నిర్వహించే స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్‌లో మద్యం సేవించి నిర్లక్ష్యంగా, వేగంగా వాహనాలు నడిపిన వారిని అదుపులోకి తీసుకొని వాహనాలు సీజ్ చేయడం, జరిమానాలు విధించడం, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడం, బైండ్ఓవర్ వంటి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. ముఖ్యంగా యువతపై ఏదైనా కేసు నమోదైతే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు, విదేశీ ప్రయాణాల కోసం వీసాలు పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. యువత మద్యం సేవించకుండా జాగ్రత్త వహించాలని, తల్లిదండ్రులు తమ పిల్లలపై పర్యవేక్షణ ఉంచాలని, అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వేడుకల సందర్భంగా ఎలాంటి అపశ్రుతులు జరగకుండా వాహన తనిఖీలు, పెట్రోలింగ్, పికెట్స్, మఫ్టీ టీమ్స్, ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు వంటి ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు చట్టాన్ని గౌరవిస్తూ పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిషేధిత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగం జరిగితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ నూతన సంవత్సర వేడుకలను ప్రజలు, యువత శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, కుటుంబ సమేతంగా తమ ఇళ్లలో సంతోషంగా, చట్టబద్ధంగా నిర్వహించుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రైతుల కోసం వేసిన రోడ్డుపై కాంగ్రెస్ నేత కొలగని అనిల్ తప్పుడు ఫిర్యాదు , దుష్ప్రచారం.

- డిఆర్వోకు వినతి పత్రం సమర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడిన నగునూరు రైతులు



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 30**
నగునూరు గ్రామంలో రైతుల రవాణా , రాకపోకల అవసరాల కోసం రోడ్డును నిర్మించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కు స్థానిక రైతులందరూ కలసి వినతి పత్రం సమర్పిస్తే, ఈజీఎస్ ద్వారా రోడ్డు నిర్మాణం చేయించారని , రైతులకు ఉపయోగపడే రహదారి విషయంలో కాంగ్రెస్ నేత కొలగని అనిల్ తప్పుడు ఫిర్యాదు చేసి, దుష్ప్రచారం చేయడం సరికాదని , అనిల్ చేసిన అసత్య ఫిర్యాదును వెంటనే వెనక్కి తీసుకోవాలని నగునూరు రైతులు డిమాండ్ చేశారు. మాజీ కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ పై ఆరోపణలు చేసి, ప్రజావాణిలో కోలగని అనిల్ తప్పుడు ఫిర్యాదు చేశారని నగునూరు రైతులు మంగళవారం రోజున జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులకు వాస్తవ విషయాన్ని వివరించి, అనిల్ ప్రజావాణిలో తప్పుడు ఫిర్యాదు చేశారని జిల్లా రెవెన్యూ అధికారికి లిఖితపూర్వకంగా వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నగునూరు రైతులు మీడియాతో మాట్లాడారు. కొలగని అనిల్ తన రాజకీయాల కోసం అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ రైతుల మేలు కోసం రహదారి నిర్మాణం చేస్తే కాంగ్రెస్ నేత అనిల్ హర్షించాల్సింది పోయి మాజీ కార్పొరేటర్ కోలగాని శ్రీనివాస్ పై అనవసర ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఈ రహదారి చుట్టుపక్కల ఉన్న రైతుల ప్రయోజనాలను కోలగని అనిల్ గుర్తించకుండా , కేవలం మాజీ కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ లక్ష్యంగా తప్పుడు ఫిర్యాదు చేసినట్టు స్పష్టంగా అర్థమవుతుందన్నారు. నగునూరు రైతుల కు అన్ని విధాల ఉపయోగపడే రహదారి విషయంలో తప్పుడు ఆరోపణలు చేసి ఫిర్యాదు చేసిన కొలగని అనిల్ వెంటనే ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## వ్యాయామ ఉపాధ్యాయులకు యోగ క్లాస్



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వ్యాయామ ఉపాధ్యాయుల కాంప్లెక్స్ మీటింగ్‌లో భాగంగా మంగళవారం కోనరావుపేట మండలంలోని ప్రభుత్వ హైస్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయులకు యోగా క్లాస్ నిర్వహించడం జరిగిందని రాజన్న సిరిసిల్ల జిల్లా యోగ ఆసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు, యోగా టీచర్ ఎలిగేటి కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సూర్య నమస్కారాలు ఆసనాలు, ప్రాణాయామం,ధ్యానం యోగా సాధనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశం, వ్యాయామ ఉపాధ్యాయులు, ఆర్పీలు సురేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# అందోలు లో శ్రీ రంగనాథ స్వామిని దర్శించుకున్న భక్తులు








**కరపత్రం ప్రతినిధి అందోలు**
ముక్కోటి వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని సంతరించుకొని అందోల్ మండలంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అందోల్ గ్రామంలో కొలువైన శ్రీ భూనీలా సమేత రంగనాథ స్వామి దేవాలయంలో స్వామివారి దర్శనానికి చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు దర్శనానికై తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. దేవాలయానికి విచ్చేసిన భక్తులకు అక్సాన్ పల్లి గ్రామానికి చెందిన ఆరేటి అరుణ-సుదర్శన్ రెడ్డి,ఆరేటి స్వప్న-సురేందర్ రెడ్డి దంపతులు తులసి మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఇంట తులసి మొక్క ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తులసి మొక్క సాక్షాత్తు లక్ష్మీదేవి స్వరూపమని. అనేకమైనటువంటి ఔషధ గుణాలను కలిగి ఉందని ప్రతి ఇంటా తులసి మొక్క నాటాడం ద్వారా అష్టైశ్వర్యాలు పొంది ఆరోగ్యంతో జీవిస్తారనే సదుద్దేశంతో తులసి మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలియజేశారు. అనంతరం ఆలయ పూజారి శ్యామనాథ్ శర్మ మాట్లాడుతూ.. దేశంలోని ఉత్తర ద్వార దర్శనం అంటే ఎంతో పుణ్యఫలం అని ఆయన అన్నారు. ఈ ముక్కోటి ఏకాదశి నాడు ఉత్తర ద్వారా దర్శనం చేసుకుంటే జన్మ ధన్యమవుతుందని.. 3000 కోట్ల మంది దేవతలు ఆశీస్సులు మనపై ఉంటాయని మనం చేసిన తప్పుల దోషాలు తొలుగుతాయి.. మనం మొక్కిన కోరికలు నెరవేరుతాయని అయినా అన్నారు. ఈరోజు ప్రత్యేకంగా శ్రీ మహా విష్ణుమూర్తి కి ఉత్తర ద్వారం ద్వార దర్శనం చేసుకుని మెక్కుతే కోరిన కోరికలు తీరుతాయని ఆయన అన్నారు.

## డిసెంబర్ 31 డ్రంకన్ డ్రైవ్ విస్తృత తనిఖీలు

- ప్రధాన కూడళ్లలో పకడ్బందీ ఏర్పాట్లు
- పట్టణ ట్రాఫిక్ ఆర్ఎస్ఐ సముద్రాల రాజు



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో డిసెంబర్ 31 సందర్భంగా బుధవారం విస్తృత తనిఖీలు చేపడుతున్నట్లు వేములవాడ పట్టణ ట్రాఫిక్ ఆర్ఎస్ఐ సముద్రాల రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 31 వేడుకలను ప్రతి ఒక్కరూ ఇంట్లోనే ప్రశాంతంగా జరుపుకోవాలని, తప్ప తాగి రోడ్లపైకి వచ్చి ఇతరులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని, తాగి పట్టుబడితే వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెడతామని భవిష్యత్తులో వారు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ప్రతి ఒక్కరూ పోలీసు వారికి సహకరించాలని ఆయన కోరారు.

# రాముని గుండాల కొండపై ముక్కోటి ఏకాదశి వేడుకలు





**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని డిసెంబర్ 30:**
ముక్కోటి ఏకాదశి సందర్భంగా రాముని గుండాల కొండపై స్వయంభువుగా వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ద్వీదశాబ్ద ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం భక్తులు స్వామీ వారిని ఉత్తర ద్వారా దర్శనం చేసుకున్నారు. నరేష్ అచార్యులు ఆధ్వర్యంలో ఏడుగురు వేద పండితుల ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామీ కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. కల్యాణములో 18 జంటలు పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. శ్రీవారి సేవ కోలాటం సభ్యులు కోలాటలు, భజనలు కీర్తనలు చేశారు. కార్యక్రమంలో రామగుండం యస్.ఐ సంధ్య, ఆలయ కమిటీ సభ్యులు, రవీందర్, మేడి తిరుపతి, కట్కూరి నరేష్ గౌడ్, శివ ప్రసాద్, శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, గంగాధర్, లింగయ్య మల్లేష్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అడుగడుగునా ఆధ్యాత్మికత ఉట్టిపడిన మాళవిక ఆనంద్ సంగీత విభావరి

» కోకిల గానం ఎన్ని సార్లు విన్న చెవికి ఇంపుగానే ఉంటుంది

» యువ గాన కోకిల మాళవిక ఆనంద్ స్వరం అంతే సొంపుగా ఉంటుంది






**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో,డిసెంబర్ 30**

భారతరత్న, ఆనాటి భారతగాన కోకిల "లతా మంగేష్కర్" కు శ్రద్ధాంజలి సందర్భంగా "లగ్ జా గలే" స్వర మాలికను, నేటి మన యువ గాన కోకిల మాళవిక ఆనంద్ తెలంగాణ సరస్వతి పరిషత్ హాల్, రామ్ కోటి లో ఘనంగా గాత్ర కచేరి చేశారు. యుగళగీతాలతో పాటు దేశ రక్షణకు అనునిత్యం పోరాడే సైనికులకు ఉత్తేజాన్ని ఇచ్చే ప్యాట్రియోటిక్ పాటలతో పాటు భక్తి పారవశ్య పాటలు కూడా మన నవ యువ "మాళవిక" స్వరమాలికలో కొన్ని ఆణిముత్యాలు సభికులను పారవశ్యంలో ముంచేసింది. స్వర్గీయ భారతరత్న లతా మంగేష్కర్ ఆలపించిన గీతాలను అద్భుతంగా ఆలపించడమే కాక అనేక భజన గీతాలను యువ గాన కోకిల, ఆల్ ఇండియా రేడియో గ్రేడెడ్ ఆర్టిస్ట్ మాళవిక ఆనంద్ ఆలపించి ప్రేక్షకులను అలరించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, శ్రీరామ సాంస్కృతిక సంస్థ శ్రీరామ యువరాగం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్ హాల్లో జరిగిన కార్యక్రమం ప్రేక్షకులను కట్టిపడేసింది. బహుముఖ ప్రజ్ఞాశాలి మాళవిక ఆనంద్, ఇప్పటి వరకు 700 పైచిలుకు కచేరీలు, చేయడమే కాకుండా మూడుసార్లు అమెరికా, ఒకసారి దుబాయిలో తన సంగీత విభావరి లో గళాన్ని వినిపించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ప్రపంచ తెలుగు మహాసభలలో ఆధ్యాత్మిక గాయనిగా వేదికలు పంచుకోవడం, అనర్గళంగా 8 భాషలు తెలుగు, హిందీ, కన్నడ, మరాఠీ, మలయాళీ, జోధ్పూర్, ఉర్దూ భాషలు మాట్లాడడం మాళవిక సొంతం. ప్రార్థన గీతంతో జ్యోతి ప్రజలను తో ప్రారంభమైన కార్యక్రమంలో సహ గాయకులుగా సంతోష్ పిట్ల, తరుణ్ రాఘవేంద్ర, పిన్నమరాజు శ్రీ రమణి వి.సాహితీ చేపూరి శ్రేయ తమ గానాలు అందించగా కార్యక్రమ వ్యాఖ్యాతగా, ఎన్ లలిత అద్భుతంగా హిందీ, ఇంగ్లీష్ లో వ్యాఖ్యానం అలవోకగా సాగించింది.

ఆధ్యాత్మిక గాయానికి అద్భుత పురస్కారం

ఇదే వేదికపై కుమారి మాళవిక ఆనంద్ కు శ్రీరామ సాంస్కృతిక సంస్థ శ్రీరామ యువరాగం ఆర్ట్ థియేటర్స్, సంయుక్తంగా బాలు లతా మంగేష్కర్ ఆత్మీయ పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ గా శ్రీరామ సాంస్కృతిక సంస్థ కోఆర్డినేటర్ రవికుమార్ కార్యక్రమం సమన్వయం చేయగా, చంద్రశేఖర్ గొర్తి కార్యక్రమం ఆసాంతం పర్యవేక్షించారు. మొత్తంగా స్వర్గీయ, భారతరత్న అవార్డు గ్రహీత లతా మంగేష్కర్, గొంతులో జాలువారిన పాటలు మాళవిక ఆనంద్ పాడి అలరించారు. సుచిత వివేకానందుల గారాల పట్టి మాళవిక. ఆ ఇంట నిత్యం సరస్వతి సరిగమలు ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. ఎక్కడ చూసినా జ్ఞాపికలతో పాటు ప్రశంసా పత్రాలు దర్శనమిస్తాయి. మాళవిక స్వరమాలికలో అత్యున్నత స్థాయిని అధిరోహించాలని మనసారా అభినందించాలి.

# సీనియర్ జర్నలిస్టు లక్ష్మణరావు కన్నుమూత



» టీడబ్ల్యూజేఎఫ్ సంతాపం

**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, డిసెంబర్ 30**

సీనియర్ జర్నలిస్టు, 'మఫసిల్ స్పెషలిస్టు'గా పేరుగాంచిన టీకే లక్ష్మణరావు (70) ఇక లేరు. తెలుగు పత్రికా రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన అధ్యాయాన్ని రాసుకున్న లక్ష్మణరావు కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్ లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం పట్ల జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశాయి. 1954లో తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడులో లక్ష్మణరావు జన్మించారు. తండ్రి తెంపల్లి ఆంజనేయులు. గ్రేడ్ వన్ తెలుగు పండితులు. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో ఇంటర్మీడియేట్, కాకినాడలో బీఏ చదివారు. పి.హెచ్.డి చేశారు. రాజకీయాలంటే విపరీతమైన ఇష్టం వల్ల రోజూ న్యూస్ పేపర్ చదివే అలవాటు ఉండేది. ఆ క్రమంలో 'ఉదయం' పత్రికలో అవకాశం రావడంతో ఊహించని కల నిజమైపోయింది.1984లో ప్రముఖ ఎడిటర్ ఏబీకే ప్రసాద్ సారథ్యంలో 'ఉదయం' పత్రికలో ట్రైనీ సబ్ ఎడిటర్ గా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. సుమారు 38 ఏళ్ల సుదీర్ఘ కెరీర్లో ఉదయం, ఆంధ్రభూమి, వార్త, సాక్షి వంటి ప్రధాన దినపత్రికల్లో వివిధ కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆయనకు సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి ప్రేరణ. వృత్తి జీవితంలో ఎన్నో ఎదురుదెబ్బలు తిన్నారు. మొత్తానికి నిలదొక్కుకుని ఉన్నత పదవులు పొందుతూ మెయిన్ స్ట్రీమ్ పత్రికల్లో 38 ఏళ్ల ప్రస్థానం సాగించారు. 'సాక్షి'లో అసిస్టెంట్ ఎడిటర్ గా రిటైరయ్యి గత పదేళ్లుగా విశ్రాంత జీవితం గడుపుతున్నారు.గ్రామీణ విలేకరుల పక్షపాతిగా ఆయనకు పేరుంది. పత్రికా వ్యవస్థకు గ్రామీణ విలేకరులే పునాదిరాళ్లని బలంగా నమ్మే ఆయన, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ 'మఫసిల్ ఎడిటర్'గా ఎంతో గుర్తింపు పొందారు. "వార్త అబద్ధపు పొగడ్తలతో ఉండకూడదు.. వాస్తవానికి దగ్గరగా ఉండాలి.. ఎవరినీ నొప్పించకూడదు" అనే సూత్రాన్ని ఆయన త్రికరణ శుద్ధిగా పాటించారు. భాషలో పరుష పదజాలం పెరుగుతున్న నేటి జర్నలిజం పోకడల పట్ల ఆయన ఎప్పుడూ ఆందోళన వ్యక్తం చేసేవారు.గ్రామీణ విలేఖరులు తెచ్చే వార్తలకు అద్భుతమైన శీర్షికలు పెట్టి ఎందరెందర్నో కదిలించారు. లక్ష్మణ రావుకు భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. లక్ష్మణరావు అంత్యక్రియలు బుధవారం (డిసెంబర్ 31) గోపన్నపల్లిలోని జర్నలిస్టు కాలనీలో జరగనున్నాయి.

టీడబ్ల్యూజేఎఫ్ సంతాపం

సీనియర్ జర్నలిస్టు టీకే లక్ష్మణ రావు మృతి పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) సంతాపం ప్రకటించింది. మూడున్నర దశాబ్దాలకు పైగా వివిధ ప్రముఖ పత్రికల్లో పని చేసిన లక్ష్మణ రావు పత్రికా రంగానికి, జర్నలిస్టులకు అందించిన సేవలు మరువలేనివని ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య పేర్కొన్నారు.తెలుగు పత్రికా రంగం ఒక గొప్ప మార్గదర్శిని కోల్పోయిందని ఆయన కొనియాడుతూ, లక్ష్మణరావు కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

# నిజమైన జర్నలిస్టులకు అన్యాయం జరగదు

» మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

» మంత్రిని కలిసిన తెలంగాణ జర్నలిస్టు సంఘాల జేఏసీ



తెలంగాణ తొలి మెట్టు/చీఫ్ బ్యూరో, డిసెంబర్ 30

**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, డిసెంబర్ 30**

తెలంగాణలో గతంలో ఇచ్చిన మీడియా అక్రెడిటేషన్ కార్డుల కంటే అధికంగానే ఇస్తామని, నిజమైన జర్నలిస్టులకు తమ ప్రభుత్వ హయాంలో ఎలాంటి అన్యాయం జరగనివ్వబోమని రాష్ట్ర సమాచార,పౌరసంబధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అక్రిడిటేషన్ల జీవో 252 విషయంలో జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఏదైనా పొరపాట్లు ఉంటే త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశమై సవరిస్తామని అన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ జర్నలిస్టు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ(టీజేఏ జేఏసీ) నాయకులు మంత్రి పొంగులేటిని కలిసి జీవో 252 సవరణతో పాటు జర్నలిస్టుల ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అతి త్వరలో అన్ని జర్నలిస్టు సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని, అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని మరో జీవో తెస్తామని అన్నారు. డెస్క్ లో పనిచేసే వారికి, ఫీల్డ్ లో పనిచేసే జర్నలిస్టులకు అనేక సంక్షేమ పథకాలను అంచెలంచెలుగా అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సమాచార పౌరసంబధాల శాఖ స్పెషల్ కమీషనర్ సీహెచ్ ప్రియాంక లకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 252 మార్గదర్శకాలలోని అభ్యంతరాలను నోటిఫికేషన్‌కు ముందు సవరించాలని, చిన్న పత్రికలు, కేబుల్ ఛానెళ్లతో పాటు ఎంపానల్మెంట్ కాకుండా ఉన్న ఇతర పత్రికలకు సంబంధించిన ప్రతి జర్నలిస్టుకు వారి సీనియారిటీని పరిగణనలోకి తీసుకొని అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని వారు కోరారు.రెండు కార్డుల వ్యవస్థకు బదులుగా, డెస్క్ జర్నలిస్టులకు కూడా జర్నలిస్టుల మాదిరిగానే ఒకే అక్రిడిటేషన్ కార్డు వ్యవస్థను కొనసాగించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు అయిందని, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులకు 15 సంవత్సరాల సీనియారిటీ నిబంధన అసంబద్ధమని, ఈ నిబంధన తొలగించాలని డిమాండ్ చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన వారందరికీ ఎటువంటి షరతులు లేకుండా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, జర్నలిస్టుల కుటుంబాలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించాలని, ఇందుకు కోసం వెంటనే ఆయా విభాగాలకు అధికారిక ఆదేశాలు జారీ చేయాలని కోరారు. జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు బీమా సౌకర్యం కల్పించాలని,

60 సంవత్సరాలు నిండిన జర్నలిస్టులందరికీ నెలకు రూ. పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని, జర్నలిస్టులకు దేశవ్యాప్తంగా రైల్వే ఫ్రీ పాసులు కల్పించాలని,అదేవిధంగా జర్నలిస్టుల వాహనాలకు టోల్ గేట్ ఫీజు నుంచి మినహాయింపు సదుపాయం కల్పించాలని వారు మంత్రిని కోరారు. మంత్రిని, కమీషనర్ ను కలిసిన వారిలో జేఏసీ కన్వీనర్లు మామిడి సోమయ్య(టీడబ్ల్యూజేఎఫ్,కే.కోటేశ్వర్ రావు(ఏడబ్ల్యూజేఏ), అనంచిన్ని వెంకటేశ్వరరావు(టీజేఎస్ఎస్), పులిపలుపుల ఆనందం(ఐఎఫ్ డబ్ల్యూజే), రావికంటి శ్రీనివాస్ (డబ్ల్యూజేఐ), గౌటి రామకృష్ణ, రాణా ప్రతాప్, కీర్తి సంతోష్ రాజు తదితరులున్నారు.

# ఫిబ్రవరిలో మున్సిపల్, మేలో జిహెచ్ఎంసి ఎన్నికలు?



**కరపత్రం ప్రతినిధి /చీఫ్ బ్యూరో, డిసెంబర్ 30**

రాష్ట్రంలో మరోసారి ఎన్నికల నగారా మోగనుంది. ఈ మేరకు ఫిబ్రవరి 2026 లో నిజామాబాద్, మహబూబ్నగర్, కొత్తగూడెం, మంచిర్యాల, రామగుండం, కరీంనగర్ జిల్లాల్లో మున్సిపల్ ఎన్నికలు పూర్తి చేసేలా ఎలక్షన్ కమిషన్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మే చివరి నాటికి జిహెచ్ఎంసి, ఖమ్మం, వరంగల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరపాలని చూస్తున్నట్లు సమాచారం. రిజర్వేషన్ల గెజిట్ వచ్చిన తర్వాత అధికారిక నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

# చైనా మాంజా వాడితే జైలే..

- మట్వాడ పోలీసుల హెచ్చరిక



**కరపత్రం ప్రతినిధి వరంగల్, డిసెంబర్ 30**

చైనా మాంజా (చైనా దారం) అమ్మకం,కొనుగోలు లేదా వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మట్వాడ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్వో కరుణాకర్ రావు హెచ్చరించారు. చైనా మాంజా వినియోగం పూర్తిగా నిషేధించబడినదని,దీనిని ఉపయోగిస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని తెలిపారు.పతంగిలను ఎగురవేయడానికి ప్రభుత్వం అనుమతించిన దారాలను మాత్రమే వినియోగించాలని ఆయన సూచించారు.చైనా మాంజా వాడకం వల్ల ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, పక్షులు మరియు చిన్న పిల్లలకు తీవ్ర ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్న ఎస్హెచ్వో, ప్రజలు చైనా మాంజాను ఉపయోగించకుండా పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

# జిహెచ్ఎంసి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డిని కలిసిన మణికొండలోని సమాఖ్య కాలనీవాసులు





**కరపత్రం ప్రతినిధి మణికొండ/డిసెంబరు 30**

అన్ని కాలనీల సమాఖ్య ప్రతినిధులు మంగళవారం కొత్త జిహెచ్ఎంసి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి ని కలిసి, దోమల బెడద యొక్క ప్రధాన సమస్య గురించి చర్చించారు. సరస్సుల నుండి వచ్చే డ్రైనేజీ ప్రవాహాన్ని నిన్న మళ్లించారని కమిషనర్ మాకు తెలియజేశారు, ఇది దోమల పెంపకానికి ప్రధాన కారణంగా గుర్తించబడింది. రెండు సరస్సుల నుండి ఎండిన నీటి హైసింత్‌ను తొలగించి, సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు నిరంతరం లార్విసైడ్‌ను ప్రయోగించాలని మేము అధికారులను అభ్యర్థించాము. కమిషనర్ ప్రకారం, ఈ మళ్లింపుతో దోమల నియంత్రణ గణనీయంగా మెరుగుపడుతుందని భావిస్తున్నారు. మణికొండలోని అన్ని కాలనీలలో పెండింగ్‌లో ఉన్న ఆమోదించబడిన పనులను అమలు చేయడం మరియు ఆక్రమణలను తొలగించాల్సిన అవసరాన్ని కూడా మేము హైలైట్ చేసామన్నారు. అన్ని కాలనీల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. దోమల బెడదను నియంత్రించడంలో త్వరలో సానుకూల ఫలితాలు కనిపిస్తాయని మేము ఆశిస్తున్నామన్నారు. మణికొండలోని అన్ని కాలనీల సమాఖ్య అధ్యక్షుడు వంశీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.పి. అవినాష్, ఎం.భరత్ యాదవ్ , డీఎస్ రావ్, సుభాష్ నారాయణ్, రంగాచారి, క్రిష్ణమూర్తి, శంకర్ దేవ్,ఎం. క్రిష్ణ కుమార్,వెంకటేశ్వరరావ్, రామయ్య,కిరణ్,ప్రవీణ,రమేష్ గౌడ్,గోవర్ధన్ రెడ్డి తదీతరులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, డిసెంబర్ 30**

వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం తిరుమల శ్రీవారిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కుటుంబ సమేతంగా వైకుంఠ ద్వార ప్రవేశం చేసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వీరికి వేద పండితులు వేద ఆశీర్వదం అందించగా.. ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా స్వామి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి చెందాలని, రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వైకుంఠనాథుడిని ఎంపీ డా.కడియం కావ్య వేడుకున్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

**తిరుమల,డిసెంబరు 30 కరపత్రం ప్రతినిధి**

వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయానికి సినీ, రాజకీయ ప్రముఖులు తరలివచ్చారు. అర్ధరాత్రి నుంచి వైకుంఠ ద్వారాలు తెరుచుకోవడంతో పలువురు ప్రముఖులు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి సతీమణి సురేఖ శ్రీవారిని దర్శించుకున్నారు. ఇద్దరు కుమార్తెలు, మరికొంత మంది కుటుంబసభ్యులతో కలిసి సురేఖ ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. ఏపీ మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, అచ్చెన్నాయుడు, సత్యకుమార్, ఏపీ అసెంబ్లీ స్పీకర్ అచ్చెన్నాయుడు, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, దానం నాగేందర్, నటుడు నారా రోహిత తదితరులు కుటుంబ సమేతంగా వచ్చి తిరుమల శ్రీవారి సేవలో పాల్గొన్నారు.